## 4 వ మాట

**జీవాధిపతియైన యేసయ్య నామమునకు మహిమ కలుగును గాక!**

**మూలవాక్యము:-** మత్తయి 27:46, మార్కు 15:34 ఇంచుమించు మూడు గంటలప్పుడు యేసు ఏలీ, ఏలీ, లామా సబక్తానీ అని బిగ్గరగా కేకవేసెను. ఆ మాటకు నా దేవా, నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివని అర్థము.

**ప్రవచనము:** కీర్తన22:1 -నా దేవా నా దేవా, నీవు నన్నేల విడనాడితివి? నన్ను రక్షింపక నా ఆర్తధ్వని వినక నీవేల దూరముగానున్నావు?

**మరణ శాసనమెక్కడ ఉండునో, మరణశాసనము వ్రాసిన వాని మరణము అవశ్యము(హెబ్రీ 9:16). ఏదేనులో మరణశాసనము వ్రాసింది యేసయ్యే. మంచిచెడ్డల తెలివినిచ్చు చెట్ల ఫలములు తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని ఆదాముకు చెప్పి మరణశాసనము వ్రాసారు. ఇప్పుడు ఆయన మరణిస్తేనే ఆ శాసనము నెరవేర్చబడుతుంది. యేసయ్య మరణించాలంటే ఆయన దేవునిగా మరణించడం అసాధ్యము. ఎందుకనగా దేవుడు అమరుడు. గనుకనే ఆయన మానవ రూపంలో మనుష్యకుమారునిగా, శరీరధారిగా ఈ లోకం లోనికి వచ్చి సిలువ మరణము పొందుచున్నారు. మరణ శాసనము నెరవేర్చబడి కొట్టివేయబడే సమయము ఆసన్నమైంది. మొదటి మాటలో తండ్రీ అని పిలిచి తండ్రికి విజ్ఞాపన చేసిన యేసయ్య, రెండవ మాటలో దొంగను పరదైసు తీసుకువెళతానని చెప్పి దొంగకు క్షమాపణ ఇచ్చిన యేసయ్య, మూడవ మాటలో తల్లి భాద్యతలను నెరవేర్చిన యేసయ్య ఇప్పుడు నాలుగవ మాటలో తండ్రితో కలిగిన ఎడబాటును గురించి మాట్లాడుతున్నారు. మొదటి మాటలో తండ్రీ అని పిలచిన యేసయ్య , ఇప్పుడు నాదేవా,నాదేవా అని పిలుస్తున్నారు. ఎందుకు అలా పిలుస్తున్నారో ఆలోచిద్దాం!**

### నా దేవా,నా దేవా :

1. తండ్రి సమస్త మానవుల ఆత్మలకు దేవుడు: సంఖ్యా 27:15 అప్పుడు మోషే యెహోవాతో ఇట్లనెను యెహోవా, సమస్త మానవుల ఆత్మలకు దేవా, యెహోవా సమాజము కాపరిలేని గొఱ్ఱలవలె ఉండకుండునట్లు ఈ సమాజముమీద ఒకని నియమించుము
2. యేసు క్రీస్తు మానవుడు: 1 తిమోతి 2:5 దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే. ఆయన క్రీస్తుయేసను నరుడు. **మనుష్యుని ద్వారా మరణం .... పునరుత్థానం.**

   1 కొరింథీ 15:21 మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను.

   **యేసయ్య మానవునిగా సిలువ మరణం పొందుచున్నారు. గనుక సమస్త మానవుల ఆత్మలకు దేవుడైన తండ్రిని నాదేవా నాదేవా అని పిలుచుచున్నారు.**

## నన్నెందుకు చెయ్యి విడచితివి?

1. **ఒక జ్ఞానాత్మ పుర్ణుడైన నాయకుడిని ఎన్నడు విడువనని తండ్రి వాగ్ధానము చేసి విడువలేదు:** **యెహోషువ 1:6** నిన్ను **విడువను** నిన్ను **ఎడబాయను**, నిబ్బరము గలిగి ధైర్యముగా నుండుము. వారికిచ్చెదనని నేను వారి పితరులతో ప్రమాణము చేసిన యీ దేశమును నిశ్చయముగా నీవు ఈ ప్రజల స్వాధీనము చేసెదవు.
2. **బలమైన ఆత్మతో నింపబడిన న్యాయాధిపతి క్రమము తప్పిపోయినప్పుడు తండ్రి విడిచినా అతడు పశ్చాత్తాపపడినప్పుడు అతని మరణ సమయంలో తిరిగి అతనికి తోడై యుండి అతనిని విడువలేదు:** **న్యాయాధి16:20** ఆమె సమ్సోనూ, ఫిలిష్తీయులు నీమీద పడుచున్నారనగా అతడు నిద్రమేలుకొని యెప్పటియట్లు నేను బయలుదేరి విరజిమ్ముకొందుననుకొనెను. అయితే యెహోవా తనను **ఎడబాసెనని** అతనికి తెలియలేదు. **న్యాయాధి16:28** అప్పుడు సమ్సోను యెహోవా ప్రభువా, దయచేసి నన్ను జ్ఞాపకము చేసికొనుము, దేవా దయచేసి యీసారి మాత్రమే నన్ను బలపరచుము, నా రెండు కన్నుల నిమిత్తము ఫిలిష్తీయులను ఒక్కమారే దండించి పగతీర్చుకొననిమ్మని యెహోవాకు మొఱ్ఱపెట్టి
3. **ప్రవక్తను విడువక నిత్యము కృప చూపినవారు పరలోకపు తండ్రి:** **యిర్మీయా 31:3** చాలకాలము క్రిందట యెహోవా నాకు ప్రత్యక్షమై యిట్ల నెను శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక**విడువక** నీయెడల కృప చూపుచున్నాను.
4. **తాను అభిషేకించిన రాజును ఎడబాయలేదు, విడువలేదు :** **కీర్తనలు 89:33** కాని నా కృపను అతనికి బొత్తిగా ఎడము చేయను అబద్ధికుడనై నా విశ్వాస్యతను **విడువను.**
5. **ఆయన ప్రజలైన ఇశ్రాయేలీయులను విడువలేదు:** **1రాజులు 6:13** నా జనులైన ఇశ్రాయేలీయులను **విడిచిపెట్టక** నేను వారిమధ్య నివాసము చేసెదను.
6. **దాస్యములో ఉన్నవారిని విడువని దేవుడు:** **ఎజ్రా 9:9** నిజముగా మేము దాసులమైతిమి; అయితే మా దేవుడవైన నీవు మా దాస్యములో మమ్మును **విడువక**, పారసీకదేశపు రాజులయెదుట మాకు దయ కనుపరచి మేము తెప్పరిల్లునట్లుగా మా దేవుని మందిరమును నిలిపి దాని పాడైన స్థలములను తిరిగి బాగుచేయుటకును యూదాదేశమందును యెరూషలేము పట్టణమందును మాకు ఒక ఆశ్రయము నిచ్చుటకును కృప చూపించితివి.
7. **తల్లి మరచినా మరవను :** **యెషయా 49:15, 16** స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటిపిల్లను మరచునా? వారైన మరచుదురు గాని నేను నిన్ను **మరువను**. చూడుము నా యరచేతులమీదనే నిన్ను చెక్కి యున్నాను నీ ప్రాకారములు నిత్యము నాయెదుట నున్నవి.




8. నా కృప నిన్ను విడచిపోదు : **యెషయా 54:10** పర్వతములు తొలగిపోయినను మెట్టలు తత్తరిల్లినను నా కృప నిన్ను **విడిచిపోదు** సమాధానవిషయమైన నా నిబంధన తొలగిపోదు అని నీయందు జాలిపడు యెహోవా సెలవిచ్చు చున్నాడు.

9. నిన్ను కాపాడువాడు కునుకడు: **కీర్తన 121:3,4** ఆయన నీ పాదము తొట్రిల్లనియ్యడు నిన్ను కాపాడువాడు **కునుకడు**. **ఇశ్రాయేలును కాపాడువాడు కునుకడు నిద్రపోడు.**

**తాను కోరుకొని తన ఆత్మతో నింపిన నాయకుడైన యెహోషువాను, న్యాయాధిపతియైన సమ్సోనును, ప్రవక్తయైన యిర్మీయాను, రాజైన దావీదును, తన ప్రజలను చెయ్యి విడువని దేవుడు, తల్లి మరచినా మరువనని చెప్పిన దేవుడు, పర్వతములు తొలగినా, మెట్టలు తత్తరిల్లినా నా కృప విడిచిపోదని చెప్పిన దేవుడు యేసయ్యను ఎందుకు చెయ్యి విడిచాడు. అసలు యేసయ్యను గురించి తండ్రి ఏమని సాక్ష్యం చెబుతున్నారు?**

- ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను:

**మత్తయి 3:17** మరియు ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించు చున్నానని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను.

- ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడి:

**మత్తయి 17:5** అతడు ఇంకను మాటలాడుచుండగా ఇదిగో ప్రకాశమానమైన యొక మేఘము వారిని కమ్ముకొనెను. ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందించు చున్నాను, ఈయన మాట వినుడని.

ముద్దుబిడ్డయైన ఎఫ్రాయిము చెయ్యి పట్టుకొని నడక నేర్పిన దేవుడు: **హోషేయా 11:3** ఎఫ్రాయిమును చెయ్యిపట్టుకొని వానికి నడక నేర్పినవాడను నేనే వారిని కౌగలించు కొనినవాడను నేనే; నేనే వారిని స్వస్థపరచినవాడనైనను ఆ సంగతి వారికి మనస్సున పట్ట లేదు

ఎఫ్రాయిమూ నేనెట్లు నిన్ను విడిచిపెట్టుదును అని ప్రశ్నించిన దేవుడు: **హోషేయా 11:8** ఎఫ్రాయిమూ, నేనెట్లు నిన్ను **విడిచిపెట్టుదును?** ఇశ్రాయేలూ, నేను నిన్ను ఎట్లు విసర్జింతును? అద్మానువలె నిన్ను నేను ఎట్లు చేతును? సెబోయీమునకు చేసినట్లు నీకు ఎట్లు చేతును? నా మనస్సు మారినది, సహింపలేకుండ నా యంతరంగము మండు చున్నది.

**ప్రియకుమారుడైన యేసయ్యను, కొలత లేకుండా ఆత్మను అనుగ్రహించిన అద్వితీయ కుమారుని (యోహాను 3: 33,34 ) ఎందుకు చెయ్యి విడిచారు?**

ఇశ్రాయేలీయుల సర్వసమాజము యొక్క పాపములు పరిహరించబడాలంటే వారి నిమిత్తము రెండు మేక పిల్లలను తీసుకొని “విడిచిపెట్టుట” అనే చీటీ ఆ రెండు మేకపిల్లల మీద వేయాలి. ఆ చీటీ ఏ మేకపిల్ల పైన పడుతుందో దానిపైన ఇశ్రాయేలు సమాజము యొక్క పాపములు మోపి దానిని తగిన వ్యక్తి చేత అరణ్యములో, ఎడారి దేశములో విడిచి పెట్టాలి(లేవి 16:21,22 ). దాని అర్థం ఆ మేకపిల్ల ఎడారిలో దప్పిచేతను, అరణ్యములో క్రూర మృగముల చేతను చంపబడాలి.

యేసుక్రీస్తు దప్పిగొని క్రూర మృగముల వంటి రోమా సైనికుల చేత చంపబడాలంటే తండ్రి ఆయనను విడిచిపెట్టాలి. మరొక మేకపిల్లను యాజకుడు దహనబలిగా అర్పించాలి(లేవి 16:15 ). ఈ లేఖనముల ప్రకారము సర్వలోక పాపములు పరిహరించబడాలంటే ఆ రెండు మేకపిల్లల వలె లోకపాపములు మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్లయైన యేసయ్య చంపబడాలి. యేసయ్య చంపబడాలంటే తండ్రి యేసయ్య చేతిని విడిచి పెట్టాలి. యేసయ్య తండ్రి చేత విడిచిపెట్ట బడటానికి ఇది ఒక కారణము అని జ్ఞాపకము చేసుకుందాం.

- **యేసుక్రీస్తు లోక పాపములను మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల: యోహాను 1:29** - మరువాడు యోహాను యేసు తనయొద్దకు రాగా చూచి ఇదిగో లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల.
- **మరియు యేసయ్య పాపముగా చేయబడ్డాడు: 2 కొరింథీ 6:21-** ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను.

పాపము దేవుని ముఖమును మనుష్యునికి (యేసుక్రీస్తు మనుష్యునిగా సిలువ మరణము పొందుచున్నారు) మరుగుచేస్తుంది.

యెషయా 59:2 - మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను గనుక ఆయన ఆలకింపకున్నాడు

- **మరియు యేసయ్య శాపగ్రాహి అయ్యాడు:_ గలతీ 3:13,14** ఆత్మను గూర్చిన వాగ్దానము విశ్వాసమువలన మనకు లభించునట్లు, అబ్రాహాము పొందిన ఆశీర్వచనము క్రీస్తుయేసుద్వారా అన్యజనులకు కలుగుటకై క్రీస్తు మనకోసము శాపమై మనలను ధర్మశాస్త్రముయొక్క శాపమునుండి విమోచించెను ఇందును గూర్చి మ్రానుమీద వ్రేలాడిన ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది
- **మరియు మ్రానున వ్రేలాడ దీయబడిన వాడు దేవునికి శాపగ్రస్తుడు: ద్వితీ 21:22,23** మరణశిక్షకు తగిన పాపము ఒకడు చేయగా అతని చంపి మ్రానుమీద వ్రేలాడదీసినయెడల అతని శవము రాత్రి వేళ ఆ మ్రానుమీద నిలువకూడదు. వ్రేలాడదీయ బడినవాడు దేవునికి శాపగ్రస్తుడు గనుక నీ దేవుడైన యెహోవా స్వాస్థ్యముగా నీకిచ్చుచున్న దేశమును నీవు అపవిత్రపరచకుండునట్లు అగత్యముగా ఆ దినమున వానిని పాతిపెట్టవలెను.




ఏ పాపము చేయని, ఎరుగని యేసయ్య నీ పాపముల కొరకు, నా పాపముల కొరకు పాపముగా, శాపగ్రాహిగా మార్చబడి విడిచిపెట్టబడిన మేకపిల్ల వలె తండ్రి చేత విడువబడి, ఏ భేదము లేకుండా పాపము చేసి తండ్రి అనుగ్రహించు మహిమను పొందలేకపోతున్న మానవాళికి తండ్రి మహిమను ఇవ్వడం కొరకు, తండ్రితో ఏర్పడిన వివాదాన్ని(యెషయా 1:18) పరిష్కరించి తండ్రికి మానవాళికి మధ్య మధ్యవర్తిగా (1తిమోతి2:5) వుండి సమాధాన పరచడానికి (కొలస్సి 1:19-22)యేసయ్య సిలువలో తండ్రి చేత విడువబడ్డాడు.

ఈ మాటలో ఎడబాటు, ప్రవచన నెరవేర్పు ఉన్నట్లుగా గ్రహించగలము. నిన్ను నన్ను పాప విముక్తులను చేయడానికి, శాప విముక్తులను చేయడానికి యేసయ్య తండ్రి చేత విడువబడ్డాడు. మరి యేసుక్రీస్తు ద్వారా తండ్రితో సమాధాన పడుటకు నీవు సిద్ధముగా ఉన్నావా? పరిశీలించుకుందాం! పరీక్షించుకుందాం! యేసుక్రీస్తు రక్తములో కడుగబడి తండ్రితో సమాధానపడుదాం! అలాంటి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకందరికి దయ చేయును గాక...ఆమేన్...ఆమేన్...ఆమేన్...!